

**ఉష్ణోగ్రత (అంచనా)**

| 19-5-2025 | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| గుంటూరు | 35 | 28 |
| తెనాలి | 36 | 27 |
| నరసరావుపేట | 36 | 26 |
| బాపట్ల | 35 | 28 |
| రెంటచింతల | 36 | 27 |
| చీరాల | 35 | 28 |



పిడుగురాళ్ల ప్రధాన రహదారి పక్కన కాలువపై ఆక్రమణ



వినుకొండ : డ్రెయిన్ దుస్థితి



సత్తెనపల్లి: మార్కెట్ వద్ద కాలువ మూసి వ్యాపారం



వినుకొండ: జీవాలయం కాంప్లెక్స్ వ్యాపార సముదాయం వద్ద కనపడని డ్రెయినేజి కాలువ

# డ్రెయిన్లన్నీ మూత

**మురుగు పారేదెలా?**

- ఆక్రమణల్లో సైడు కాల్వలు
- పూడిక తొలగించే పరిస్థితి లేదు
- మురుగు పారక ప్రజల అవస్థలు
- చినుకుపడితే రహదారులన్నీ జలమయం
- ఆక్రమణలపై దృష్టి సారించని పుర పాలకులు

రెండు రోజుల క్రితం అర్ధరాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. తెల్లారి లేచి చూసిన ప్రజలు ఇళ్ల నుంచి బయటకు అడ్డుగు పెట్టే పరిస్థితి లేనంతగా నీరు, మురుగుతో రోడ్లన్నీ నిండిపోయాయి. పట్టణ మధ్యలోని ప్రాంతాలతో పాటు శివార్లలోనూ ఇదే పరిస్థితి. వర్షపు నీరు పారుదల లేనంతగా కాల్వలన్నీ ఆక్రమించేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. అయినా మున్సిపల్ పాలకుల్లో చలనం లేదు. ఓ మోస్తరు వర్షాలకే రోడ్లన్నీ తటాకాల్లా మారుతున్నా.. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నా.. పరిస్థితి కారణాలు తెలుసుకుని సమస్య పరిష్కరించకుండా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కాల్వల్లో చెత్తాచెదారాలను పారిశుధ్య కార్మికులు తొలగించే అవకాశం లేకుండా శ్లాబులతో మూతేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. దీంతో అటు కాల్వల ఆక్రమణలు రోజురోజుకు పెరిగిపోతుండగా.. ఇటు వానొస్తే వరద అన్నట్లు పట్టణాల్లో పరిస్థితి నెలకొంది.

## వానొస్తే.. వరద.. వణుకు

వర్షాలు వస్తున్నాయంటే గుంటూరు నగరం, జిల్లా కేంద్రాలైన నరసరావుపేట, బాపట్లతో పాటు మున్సిపల్ పట్టణాల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించిన కాల్వలు ఆక్రమణలతో కొన్ని కుదించుకోగా.. మరికొన్ని పూడిక తీసే అవకాశం లేకుండా దుకాణదారులు, ఇళ్ల యజమానులు మూతేశారు. దీంతో డ్రెయిన్లు చెత్తచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. ఇళ్ల నుంచి వచ్చే మురుగే అతి కష్టంగా పారుదలవుతుంటుంది. ఈ పరిస్థితుల్లో వర్షపు నీరు పోయే దారి లేక.. డ్రెయిన్లలోని మురుగునీటికి వర్షపు నీరు తోడై రోడ్లపైకి వచ్చేస్తోంది. దీంతో ప్రధాన రహదారులతో పాటు శివారు కాలనీలు వర్షాల సమయంలో తటాకాల్లా మారుతాయి. అపరిశుభ్రత.. దుర్వాసన.. చెత్తా చెదారాలతో ప్రజలు వర్షాలు వస్తున్నాయం టే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాల వెనుక మురుగు కాలువను మూసిన వ్యాపారులు

(ఆంధ్రజ్యోతి - పల్నాడు నెట్‌వర్క్)

మున్సిపల్ పట్టణాలు.. అయినా వర్షాల సమయంలో మురికి కూపాలుగా మారిపోతున్నాయి. ప్రధాన డ్రెయిన్లతో పాటు సైడు కాల్వలు కూడా ఆక్రమణలకు గురవుతు న్నాయి. మ్యాన్ హోల్‌ను ఏర్పాటు చేయకుండా సైడ్ డ్రెయిన్లను శ్లాబు, బండలతో మూతేస్తున్నారు. కాల్వ ల్లో పడుతున్న చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొల గించేందుకు పారిశుధ్య కార్మికులకు పెద్ద తల నొప్పిగా మారింది. కాల్వలపైనే ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరంతా రోడ్లపైకి చేరుతోంది. పలు ప్రాంతాల్లో ము న్సిపల్ అధికారులు కాల్వలపై ఆక్రమణలు పట్టించుకోకపోవడంతో ఇదే అవకాశంగా మిగిలిన వారు కూడా చెలరేగిపోతున్నారు. కొన్ని పట్టణాల్లో అధికారులు నోటీసులు, ప్రచారాలకే పరిమితమవు తున్నారు. దీంతో వర్షాల సమయంలో మురుగునీరు రోడ్లపైకి చేరుతోంది. పల్లపు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఆ సమయాల్లో మున్సిపల్ పాలకులు, అధికారులు హడావుడి చేస్తున్నారు. ఆ తర్వాత కూడా కాల్వలపై ఆక్రమణలను తొలగించి వర్షపు నీటి పారుదల సక్రమంగా జరిగేలా చూసి ముంపు సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించడం లేదు. వర్షాకాలం దగ్గరకు వస్తున్నా పురపాలకులు వరద నీటి కాలువలు, ప్రధాన మురుగు కాల్వల్లో పూడిక తీసే పనులు చేపట్టడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు.

- నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలోని కాల్వల్లోని జమ్ము నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉంది. సత్తెనపల్లి, వినుకొండ, గుంటూరు, పల్నాడు రహదారుల్లోని ప్రధాన మురుగు కాల్వలు పూడికతో పూడి పోయాయి. వీటిలో నీరు ప్రవహించే పరిస్థితి లేదు. పట్టణంలోని ప్రధాన కాల్వలన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో ఓ మోస్తరు వర్షానికే నీరు పొంగి రోడ్లు తటాకాల్లా మారుతున్నాయి. ఆరేళ్ల క్రితం కురిసిన భారీవర్షంతో పట్టణంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఈ సంఘటన నుంచి ఇప్పటి వరకు కూడా అధికారులు గుణపాఠం నేర్చుకోక పోవడం గమనార్హం.
- పిడుగురాళ్ల పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న సైడ్ డ్రెయిన్లు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురయ్యాయి. అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారి, తహసీల్దార్ కార్యాలయం సమీపం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు, ఐలాండ్ సెంటర్ నుంచి జానపాడు రోడ్డులోని రైల్వేగేటు వరకు కాల్వలను దుకాణ దారులు ఆక్రమించి మూతేశారు.
- వినుకొండలో కాల్వలను మూసేసి వాటిపైనే పలువురు వ్యాపారాలు సాగిస్తున్నారు. కొత్త టౌన్‌లో కరెంట్ ఆఫీస్ నుంచి సీతయ్యనగర్, 1వ వార్డు స్కూల్, గవర్నమెంట్ వైద్యశాల వెనుక భాగం నుంచి ఇసుకవాగుకు అక్కడి నుంచి రైల్వే ట్రాక్ అవతల ముట్లకుంట కాలనీకి మురుగునీరు చేరాలి. అయితే కాల్వల్లో పూడిక తొలగింపు తూతూమంత్రంగా చేశారు. దీంతో కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీరు దిగువకు ప్రవహించని పరిస్థితి నెలకొంది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పల్నాడు రోడ్డు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డులోని ప్రధాన డ్రెయినేజీల్లో పూడిక తీయాలని ప్రజలు కోరుతున్నారు.
- సత్తెనపల్లిలో తాలూకా సెంటర్, గడియార స్తంభం సెంటర్, ఏరియా వైద్యశాల వెనుక, పాత కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో డ్రెయిన్లు ఆక్రమణలకు గురయ్యాయి. వర్షాల సమయంలో ఈ కాల్వల్లోని మురుగు నీరు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తూ పారిశుద్ధ్యం క్షీణిస్తుంది.



నరసరావుపేట : పల్నాడు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు



నరసరావుపేట: రిలయన్స్ వద్ద పూడిపోయిన ప్రధాన వరద నీటి కాలువ

# ప్రతిపాదించినా.. పట్టించుకోరు

## తాగునీటి కేటాయింపులపై తాత్సారం

- 10 టీఎంసీలు కావాలన్నా స్పందించని ప్రభుత్వం
- కేఆర్ఎంబీ అనుమతిస్తేనే సాగర్ నుంచి నీటి విడుదల
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పల్లెల్లో నీటి ఎద్దడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

చెరువుల్లో నీటి నిల్వలు నిండుకుంటున్నాయి.. ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. నీటి ఎద్దడి తీవ్ర రూపం దాల్చుతున్నా పాలకులు చోద్యం చూస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి తాగు అవసరాలకు నీటి విడుదల విషయంలో తాత్సారం జరుగుతోందన్న విమర్శలున్నాయి. సాగర్ కుడి కాల్వ పరిధిలోని పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాల్లో చెరువులు నింపేందుకు 10 టీఎంసీలు కేటాయించాలని జలవనరుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే రోజులు గడు స్తున్నా కేటాయింపులపై నేటికీ నిర్ణయిం తీసు కోలే దు. ఈ నెల మూడో వా రంలో నీటి సరఫరా చేయ నున్నట్లు ముందుగానే జలవనరుల శాఖ ప్రక టించింది. అయితే కేఆర్ఎంబీ నుంచి ఇంతవరకు అనుమతులు రాకపోవడం తో నీటి విడుదల ప్రశ్నా ర్థకంగా మారింది. కుడి కాల్వకు కేటా యింపుల మించి నీటి ని వినియోగించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీ వద్ద వాదిస్తోంది. తాగు అవసరాలకు కూడా నీటి విడుదలకు అనుమతి ఇవ్వొద్దని కేఆర్ఎంబీపై ఆ రాష్ట్ర అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఈ వాదనను తిప్పి కొడుతున్న రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించాలని కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చకముందే సాగర్ నుంచి నీటి విడుదలకు ప్రభుత్వం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

### 50 శాతం చెరువుల్లో నిండుకున్న నీరు

కుడి కాల్వ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన వందలాది చెరువులు సాగర్ జలాలపై ఆధారపడి ఉన్నాయి. దాదాపు 50 శాతం చెరువుల్లో నీటి నిల్వలు నిండుకున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ గణాంకా లు చెబుతున్నాయి. చెరువులకు సత్వరం నీటిని సరఫరా చేయా లని ఆర్‌డబ్ల్యూ ఎస్ శాఖ నుంచి జలవనరుల శాఖకు ప్రతిపాదనలు అందాయి. వినుకొండ, చిలకలూరిపేట, మాచర్ల తదితర మున్సిపాల్టీల్లోని చెరువులు నింపేందుకు నీటిని విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం నెలకొన్న తాగు నీటి ఎద్దడిని కేఆర్ఎంబీ దృష్టికి తీసుకువెళ్లి నీటి కేటాయింపులు పొందాల్సిన ఆవశ్యకత అధికారులపై ఉంది. కనీసం 8 టీఎంసీలు నీటిని సాగర్ నుంచి వినియో గించుకునేందుకు కేఆర్ఎంబీ అనుమతులు ఇవ్వాలన్న వాద నను అధికారులు వినిపిస్తున్నారు. తాగు అవసరాలకు 10 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని, అయితే ఇంకా అనుమతి రాలేదని జలవనరుల శాఖ ఎస్ఈ కృష్ణమోహన్ తెలిపారు.



బొల్లాపల్లి : గండిగనుమలలో నీటి కోసం పాట్లు

**సాఫీగా.. జేఈఈ అడ్వాన్స్**

గుంటూరు(విద్య), మే 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో ఐఐటీ కళాశాలలో ప్రవేశం కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆదివారం నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. గుంటూరు నగరం, నరసరావుపేట పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ బేస్డ్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 9 నుంచి 12 వరకు సాయంత్రం 2.30 నుంచి 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను పరీక్షకు గంట ముందు కేంద్రాల్లోకి అనుమతించారు. దాదాపు 6000 మందికి పైగా విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సమాచారం.

# త్వరలో జైలుకు జగన్

- మద్యం కేసులో పలువురు ఉన్నతాధికారులు
- పిడుగురాళ్ల మినీ మహానాడులో ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, వేదికపై ఎంపీ లావు, జంగా

పిడుగురాళ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ జైలుకు వెళ్లే రోజు సమీపిస్తోందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో ఆదివారం గురజాల నియోజకవర్గ మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో పీఎస్ఆర్ ఆంజనేయులు, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు విర్ర వీగారని విమర్శించారు. మద్యంలో దోచేసిని డబ్బుతో విచ్చలవిడిగా ఖర్చు చేసి వై నాట్ 175 అని వైసీపీ నేతలు గెలవాలని చూసినా ప్రజలు ఛీత్కరించారన్నారు. ఆర్థిక ఉగ్రవాది జగన్ పాలనలో ఉద్యోగులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేదని, వారి భద్రత సొమ్మును కూడా వాడేసుకున్నారన్నారు. దాడులు, అక్రమ కేసుల సంస్కృతికి ముగింపుపెట్టి గురజాలను రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని కాసు మహేష్‌రెడ్డి ప్రకటించారని అయితే ఏడాది గడుస్తున్నా ఆ ఊసు మరిచారన్నారు. పల్నాడులో మాటకు కట్టుబడి ఉంటారని, రాజకీయ సన్యాసం ఎప్పుడో చెప్పాలని కాసు మహేష్‌రెడ్డిని సవాల్ చేశారు. గురజాల అభివృద్ధిని మరచి నరసరావుపేటలో సొంత కాంప్లెక్స్‌ను నిర్మించుకున్న వ్యక్తి మాట్లాడే ప్రతి దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు.



హాజరైన గురజాల నియోజకవర్గ పార్టీ శ్రేణులు

### గురజాలకు ప్రాధాన్యం : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

గెలుపులో కీలకమైన గురజాల అంటే ఇష్టమని, నియోజక వర్గ అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. నిధుల కేటాయింపులో గురజాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేసి త్వరగా ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకువచ్చేలా మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడినట్లు చెప్పారు. వైసీపీ ప్రభుత్వం కేంద్రం నుంచి వచ్చిన నిధులను పక్కదారి పట్టించినందునే ప్రస్తుతం నిధుల కేటాయింపులో ఆలస్యమవుతుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు నేటికి కొనసాగుతున్నాయన్నారు. అవినీతి పాలనే వైసీపీ నేతల లక్ష్యమని గుర్తు చేశారు. కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, ఉన్నం నాగమల్లికార్జునరావు, కర్నాటి వరలక్ష్మి, తురకా వీరాస్వామి, షేక్ బాబావలి, తంగెళ్ల శ్రీను, గండికోట వెంకటేశ్వర్లు, బడి గుంచల వెంకటేశ్వర్లు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, వడ్డవల్లి సర్వేశ్వరరావు, పాం డురంగా శ్రీను, పిల్లి చెన్నారావు, వున్నం సురేష్, వేముల వినోద్‌రెడ్డి, యడ్లపల్లి రామారావు, కొల్లి కృష్ణ, నేలవల్లి బొల్లయ్య, ముప్పాల సాంబయ్య, ముప్పన వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌అలీ, చల్లగుండ్ల సీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన

- పెదకూరపాడు పరిధిలో అమరావతికి 35 వేల ఎకరాలు
- మినీ మహానాడులో శ్రీకృష్ణదేవరాయలు, ప్రవీణ్, శ్రీధర్

క్రోసూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏడాది కూటమి పాలనలో రాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధి, సంక్షేమం అమలయ్యాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌లు తెలిపారు. క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం పెదకూరపాడు నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రాష్ట్రంలో రాజధాని నిర్మాణంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కాకుండా కాపాడామన్నారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గం నుంచి రాజధాని అభివృద్ధికి 35 వేల ఎకరాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు. 22 వేల ఎకరాలకు ఒప్పందాలు కుదిరాయని, మరో మూడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి భూములు సేకరించనున్నామని తెలిపారు. ఆరు నెలల్లో నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు రానున్నాయన్నారు. నియోజక వర్గ పరిధిలోని టెంపుల్ అమరావతిని రాజధాని అమరావతిలో కలపడానికి త్వరలో గెజిట్ నోటిఫికేషన్ రానున్నదన్నారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ లక్ష కోట్లతో అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు. ఈ నెల 21న జరిగే పల్నాడు జిల్లా మహానాడుకు టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. అంతక ముందు ఎన్టీఆర్ విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నల్లపాటి రాము, జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాశయ్య, నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, నూర్జహాన్‌బేగం, ఏపూరి నాగేశ్వరరావు, అనుముల వెంకటరామిరెడ్డి, అప్పారావు, వేగుంట రాణి, గుడిపాడు బాషా, దుద్దుల యోహాన్ పాల్గొన్నారు.



మినీ మహానాడు వేదికపై ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రవీణ్, కొమ్మాలపాటి

## నేటి నుంచి నందమూరి కళాపరిషత్ నాటిక పోటీలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దంపతులు

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు కళాపరిషత్ ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు సహకారంతో నందమూరి తారకరామారావు 102వ జయంతి, ఆయన సినీ రంగంలోకి అడుగుపెట్టి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వజ్రోత్సవాలు భాగంగా సోమవారం నుంచి 21వ తేదీ వరకు నాటిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజు శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటిక, ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి కిడ్నాప్ నాటిక, 2వ రోజు యువభేరి థియేటర్స్ హైదరాబాద్ వారి నా శత్రువు నాటిక, రెండో ప్రదర్శనగా సిరిమువ్వ కల్చరల్స్ హైదరాబాద్ వారి హక్కు నాటిక, 3వ ప్రదర్శన మధుకూరి ఆర్ట్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికతో పాటు విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, 2వ ప్రదర్శనగా సౌజన్య కళాస్రవంతి, ఉత్తరాంధ్ర వారి దేవరాగం, మూడో ప్రదర్శనగా భద్రం ఫౌండేషన్, విశాఖపట్నం వారి దొందూ దొందే హాస్యనాటికలు ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడిగా జీవీ కుటుంబ సమేతంగా నాటకోత్సవాలు, వజ్రోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. చుట్టు పక్కల ప్రాంతాల ప్రేక్షకులు హాజరై వీక్షించాలని కోరారు.







## పూటి లాగుడు ప్రదర్శనతో పశు పోషకులకు ప్రోత్సాహం

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విరామ సమయంలో ఎడ్ల పూటి లాగుడు ప్రదర్శన పోటీలతో పశు పోషకులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ఆదివారం కొల్లూరు మండలం క్రాప వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి పూటి లాగుడు ప్రదర్శన పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశు పోషకులు ఎంతో ఉత్సాహంగా పోటీలకు తమ ఎడ్ల జతలతో తరలి రావడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను సాదరంగా ఆహ్వానించి, సత్కరించారు. కొద్దిసేపు ఎమ్మెల్యే పోటీలను తిలకించారు. జూనియర్ విభాగంలో ఎనిమిది ఎడ్ల జతలు పాల్గొన్నాయి. సోమవారం సీనియర్ విభాగంలో మరో 8 జతలు, 20న నియోజకవర్గ స్థాయి టైరు బండి విభాగంలో ఆరు జతలు పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 25 ఎడ్ల జతలు పాల్గొనగా విజేతలైన ఎడ్ల జత యజమానులకు సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలుతో పాటు మిగిలిన జతలకు కూడా బహుమతులు ఇవ్వనున్నారు. జూనియర్ విభాగంలో రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలుగా బహుమతులున్నాయి. మూడు రోజుల పోటీల్లో ఎడ్ల యజమానులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, డీసీ అధ్యక్షుడు యలవర్తి కోటేశ్వరరావు, పాల సొసైటీ అధ్యక్షుడు సుంకర రామమోహనబాబు, తలశిల రవితేజ, గొట్టిపాటి భానుగంగాధర్ రైతులు పాల్గొన్నారు.

## రాజధాని భూ సమీకరణకు రైతుల అంగీకారం

● బలుసుపాడు, కంభంపాడు గ్రామ సభలు ● స్వచ్ఛందంగా ముందుకొచ్చిన రైతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజా రాజధానిని నిర్మిస్తున్నారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. రైతుల నుంచి బలవంతంగా భూములు ప్రభుత్వం తీసుకోదని, రైతులు ఇష్టపడి ఇస్తేనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, కంభంపాడు గ్రామాల్లో ఆదివారం రైతులతో ల్యాండ్ పూలింగ్ పై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని అభివృద్ధే లక్ష్యంగా పనులను పరిగెత్తిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులతో కలసి భూ సమీకరణపై రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. రైతులకు న్యాయం చేసేలా చూ స్తామని భరోసా ఇచ్చారు. భూ సమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పాసు బుక్‌ల జిరాక్స్‌లను అందించిన రైతులను దుశ్శాలువాలతో సత్కరించారు. పొలాలు ఇచ్చిన రైతుల పిల్లలు చదువుకుని ఉంటే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తామన్నారు. రాజధాని ప్రాంతంలో రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ప్యాకేజీ ఇక్కడా కూడా అమలు చేస్తారని, ఈ ఏడాది కూడా ముందుగానే కౌలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా రైతులు, రైతు నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కుమార్, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వరికపూడిశెల పూర్తి చేస్తేనే రాజకీయాలు..

● లేకుంటే జీవితంలో రాజకీయాలు మాట్లాడను ● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి శపథం



మాచర్లటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రజల జీవనాడి, ఏడు దశాబ్దాల కల వరికపూడిశెలను పూర్తి చేయకుంటే.. తన జీవితంలో రాజకీయాలు మాట్లాడనని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శపథం చేశారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పచ్చగా ఉన్న పల్లెల్లో వైసీపీ మూకలు రాజకీయ చిచ్చు రేపుతూ.. శునకానందం పొందుతున్నాయని ధ్వజమెత్తారు. వరికపూడిశెల పూర్తి చేస్తానని చెప్పి.. 15 సంవత్సరాలు రాజకీయ పబ్బం గడుపుకుని.. పుట్టిన గడ్డకు, నియోజకవర్గ ప్రజలకు రామకృష్ణారెడ్డి ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్‌ను పూర్తి చేయకుంటే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన పిన్నెల్లి.. మాటమార్చి శంకుస్థాపన చేసి చేతులు దులుపుకున్నారని దుయ్యబట్టారు. ఆ పని చిన్న పిల్లలు సైతం చేయగలరని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో వరికపూడిశెల ఫేజ్ - 1, ఫేజ్ - 2 పూర్తి చేసి పల్నాడు ప్రజలకు సాగు, తాగునీరు అందించి దాహార్తిని తీరుస్తామని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో శాంతిని నెలకొల్పేందుకు సహనం పాటిస్తున్నానని, అలాగని రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తే తానేంటో చూపిస్తానని మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి, ఆయన అనుచరులను ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి హెచ్చరికలు చేశారు.

## డైమండ్ బాబు ఒంటెత్తు పోకడలు విరమించుకోవాలి

◆ వైసీపీ సమన్వయకర్తపై సొంత పార్టీ నేతల నిరసన గళం ◆ బీసీలకు అవమానం..భజనపరులకే పదవులంటూ ఆగ్రహం



డైమండ్ బాబుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న నియోజకవర్గ వైసీపీ నాయకులు

తాడికొండ, మే 18(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఒంటెత్తు పోకడలు మానుకో వాలని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలు విమర్శిస్తు న్నారు. డైమండ్ బాబు చర్యలను నిరసిస్తూ నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీ పరిరక్షణ కమిటీగా ఏర్పడి గుం టూరులో ఆది వారం సమావేశం నిర్వహించారు. పలువురు మాట్లా డుతూ డైమండ్ బాబు పార్టీ పదవులను తనకు భజన చేసిన వారికే ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీరని అన్యాయం జరుగుతుందని వాపోయారు. బీసీలకు మండలాధ్యక్ష ఇవ్వమని కోరగా.. బీసీలు మండల అధ్యక్షులుగా పనిచేయగలరా అ ని.. బీసీల ముందే మాట్లాడి అవమానించారని అవేదన వ్యక్తం చేశా రు. నియోజకవర్గం ఇన్‌చార్జిగా డైమండ్ బాబు రాజధాని ప్రాంతంలో ఎన్నో సమస్యలున్నా.. స్పందించలేదని ఆరోపించారు. రాజకీయంగా ఇబ్బందులు పడుడుతున్న వారి తరుపున పోరాడకుండా.. భజన చేసే వారికే పదవులు ఇస్తారా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్ష పదవుల్లో ఒకే సామాజికవర్గానికి మూడింటిని కేటాయించడాన్ని తప్పుబట్టారు. సీనియర్లకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వడం లేదని నిరసన తెలిపారు. జిల్లా నాయకులకు డైమండ్ బాబుపై ఫిర్యాదులు చేసినప్పటికి ఎలాంటి ప్రయోజనం లే దని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పసుపులేటి వెంకట్రావు పద్మావతి, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, తాడికొండ ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, సుమారు 300 మంది నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నాళ్లీ రైల్వే గ్రూపు-బీ పరీక్షలు..!

● పరీక్షలతో ఆపరేటింగ్ సిబ్బంది మూకుమ్మడిగా సెలవులోకి
● వాళ్లలో ఎల్‌పీ, ఏఎల్‌పీ, గార్డులు తదితరులు
● వారంలో మూడు రోజులు రద్దవుతున్న ప్యాసింజర్ రైళ్లు

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు జరుగుతోన్న గ్రూపు-బీ పరీక్షలు కారణంగా వారంలో మూడు రోజల పాటు ప్యాసింజర్ రైళ్లను గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో రద్దు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల మొదటి వారంలో 3, 4, 5 తేదీల్లో ఎనిమిది రైళ్లను రద్దు చేయగా ఇప్పుడు 17, 18, 19 తేదీల్లో అవే రైళ్లను మళ్లీ రద్దు చేశారు. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే రైళ్లను కొన్ని గంటల ముందు రద్దు చేస్తుండటంతో.. విషయం తెలియక రైల్వేస్టేషన్లకు వచ్చి నిరీక్షించి ఉసూరుమంటూ ప్రయాణికులు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నెలలో ఇప్పటికే ఆరు రోజుల పాటు రైళ్లను రద్దు చేశారు. ఇంతటితో అయిపోయిందా, ఇంకా రద్దులు ఉన్నాయా అన్న సమాచారం ఎవరికీ తెలియడం లేదు.

### రద్దయిన రైళ్లు..

రైల్వేలో గ్రూపు-సీ హోదాలో ఉన్న ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి.. గ్రూ-బీ పోస్టులను భర్తీ చేస్తారు. ఈ పరీక్షల కోసం లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకో పైలట్‌లు, స్టేషన్ మాస్టర్లు, గార్డులు, టిక్కెట్ కలెక్టర్లు, క్లర్కులు, సేఫ్టీ, ఇతర ఇంజనీరింగ్ పోస్టుల్లో పని చేస్తున్న ఉద్యోగులు హాజరవుతున్నారు. దీంతో సిబ్బంది కొరత తలెత్తుతోందని.. రైల్వే శాఖ చెబుతూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తోంది. వాటిల్లో (57201) విజయవాడ-గుంటూరు, (57203) గుంటూరు - మాచర్ల, (57206) మాచర్ల- నడికుడి, (57205) నడికుడి - మాచర్ల, (57204) మాచర్ల - గుంటూరు, (57202) గుంటూరు - విజయవాడ, (67779) కాచీగూడ - నడికుడి, (67780) నడికుడి - కాచీగూడ రైళ్లు ఉన్నాయి.

### కూలీలు, విద్యార్థులకు ఇక్కట్లు

ఈ రైళ్ల రద్దుతో పల్లెల నుంచి పట్టణానికి, పట్టణం నుంచి వేరొక ప్రదేశానికి ఉదయం వెళ్లి పని చేసుకొని వచ్చే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అలానే విద్యార్థులు, ఆదివారం పోటీ పరీక్షలకు హాజరయ్యే వాళ్లు కూడా అవస్థలు పడుతున్నారు. రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పరీక్ష రాసుకోవడానికి అనుమతి ఇచ్చేలా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైళ్లకు లేని ఇబ్బంది ప్యాసింజర్ రైళ్లకు ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో షిఫ్ట్ ఆపరేటర్ మృతి



మృతుడు రఫీ

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ రఫీ(45) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. రఫీ, లైన్‌మెన్ రాజశేఖర్ ఇద్దరూ నరసరావుపేట పట్టణ శివారు లోగల వల్లప్ప చెరువు వద్ద విద్యుత్ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. రఫీ విద్యుత్ స్తంభంపై ఉన్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి.. కిందపడిపోయాడు. అక్కడికక్కడే మృతి చెందాడు.

## నేటి నుంచి పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు (విద్య) మే 18 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 9:30 నుంచి 12:45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని డీఈఓ సీవీ రేణుక వెల్లడించారు. 4,254 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, 27 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంటర్ ఓపెన్ స్కూల్ పరీక్షలు ఉదయం 9:30 నుండి 12:30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 971 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఎండల నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఏఎన్ఎం సేవలు అందుబాటులో ఉంచినట్లు డీఈఓ వెల్లడించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పటిష్ఠమైన భద్రత కల్పించినట్లు చెప్పారు.

## దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయం

❖ మంత్రి నాదెండ్ల మనోహర్



సైనికుడి విగ్రహానికి పూలతో నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, రాజకుమారి

తెనాలి అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణలో సైనికుల పాత్ర అనిర్వచనీయమని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. కాటూరి ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన జై జవాన్ కార్యక్రమంలో పాల్గొని, సైనికుని విగ్రహానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. దేశ రక్షణలో వీరోచితంగా పోరాడి స్ఫూర్తిగా నిలిచిన సైనికులకు వీరతిలకం దిద్ది పూలతో అభిషేకం చేశారు. ఐరన్ స్క్రాప్‌తో విగ్రహాన్ని తయారు చేసిన శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర, శ్రీహర్షలను అభినందించారు. గ్యాలరీలో రూపొందించిన ఛత్రపతి శివాజీ, భరతమాత విగ్రహాలను ఆవిష్కరించారు. గ్యాలరీలో శిల్పాలను సందర్శించారు.

## వేడుకగా బాల ఏసు దేవాలయ వజ్రోత్సవాలు



దేవాలయాన్ని పునఃప్రతిష్ఠించి గ్రామ క్రైస్తవులకు అంకితం చేస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

అచ్చంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో ఉన్న బాల ఏసు దేవాలయం వజ్రోత్సవాలను ఆదివారం రెండవ రోజు వేడుకగా నిర్వహించారు. గ్రామ నిర్మాత శ్రీ అరుణానంద స్వామి తిరునాళ్ల సందర్భంగా 125 వసంతాల మహోత్సవం కూడా జరిగింది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిన భాగ్యయ్య రాత్రి పునఃప్రతిష్ఠించి, దేవాలయంలోని స్వరూపాలను ఆశీర్వదించారు. తాళ్ళచెరువు గ్రామ క్రైస్తవులకు అంకితం చేశారు. తాళ్ళచెరువు విచారణ గురువు డాక్టర్ పుట్టి అంతోని రాజు, 50 మంది గురువులు, 70 మందికి పైగా కన్య స్త్రీలతో పాటు పలు గ్రామాల్లోని క్రైస్తవులు ఈ జూబ్లీ వేడుకలకు హాజరయ్యారు.

## మాట నిలబెట్టుకుంటున్న కూటమి ప్రభుత్వం

❖ శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి



రెంటచింతల,మే 18 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టతనిస్తూ.. అతివలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఉచిత బస్సు ప్రయాణానికి ముహూర్తం ఖరారైందని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం, పాఠశాలలు తెరిచే సరికి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ పాలకులకు భిన్నంగా.. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అంతమందికి పథకం వర్తింపజేయడం విశేషమన్నారు. రాబోయే రోజుల్లో మూడు సిలిండర్లకు ఒకేసారి నగదు జమ చేయబోతున్నారని చెప్పారు. అలాగే అన్నదాతల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారని, త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులు పడతాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఆర్టీసీ చార్జీలను పెంచి.. పేదల నడ్డి విరగొట్టిందని విమర్శించారు. చంద్రబాబు దూరదృష్టి గల నేత కావడం వల్లనే ఒక్కొక్కటిగా పథకాలు అమలు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఆర్యవైశ్య నేత కొత్త అంజి తదితరులు పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి ఎంపికలు

మంగళగిరి సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు జరిగాయి. 15 మంది మహిళా పవర్ లిఫ్టర్లు, 11 మంది పురుష లిఫ్టర్లను సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ ఎక్విప్డ్, బెంచ్‌ప్రెస్ పోటీలకు ఎంపిక చేసినట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 31 నుంచి జూన్ రెండో తేదీ వరకు ఒంగోలులో జరిగే



ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, భాస్కరరావు, బొల్లినేని చంద్రిక, సంయుక్త కార్యదర్శులు ఘట్టమనేని సాయిరేవతి, ఎస్‌డీ మస్తాన్‌వలి అభినందనలు తెలిపారు.

## ఇరుకుటుంబాల ఘర్షణ: ఒకరి మృతి

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పమిడిపాడు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. నరసరావుపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిపాడు గ్రామానికి చెందిన ఫిరంగుల కోటేశ్వరరావు(40), కోట్ల అంజి ఇద్దరూ ఒకే వీధిలో ఎదురెదురుగా నివాసం ఉంటున్నారు. అంజికి చెందిన గొర్రెల వల్ల కోటేశ్వరరావు ఇంటి పరిసరాలు అపరిశుభ్రం అవుతున్నాయని కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో సాయంత్రం ఇదే విషయంలో ఇద్దరికీ ఘర్షణ జరిగింది. అంజి కర్రతో కోటేశ్వరరావు తలపై గట్టిగా కొట్టడంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృ తుడికి భార్య, ఇద్దరు పిల్లలు న్నారు. సమాచారం అందు కున్న రూరల్ ఎస్ఐ కిషోర్ ఘటనా స్థలానికి చేరుకుని, ప రిశీలించారు. కేసు నమోదు చే సుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

### సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 18 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 130, 139, 150 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 248.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 258.00 |

## నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు వేసవి సెలవులు

దాచేపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉండటంతో నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈనెల 18వ తేదీ నుంచి 31వరకు సెలవులు ప్రకటిస్తున్నట్టు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి నూరె శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగుమతి, దిగుమతిదారులు, రైతులు ఈనెల 31వ తేదీ వరకు తమ పంట ఉత్పత్తులను యార్డుకు తీసుకు రావద్దని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి యార్డు తిరిగి పని చేస్తుందని ఆయన వివరించారు.

## రాష్ట్ర సరిహద్దు వద్ద డ్రంకెన్ డ్రైవ్



పొందుగుల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, ఎస్ఐ పాపారావు తదితరులు

దాచేపల్లి, మే 18(ఆంధ్ర జ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు దాచేపల్లి మండలం పొందుగుల చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. ఆదివారం దాచేపల్లి సీఐ పర్యవేక్షణలో ఎస్ఐ పాపారావు వాహనాలను, డ్రైవర్లను తనిఖీ చేశారు. తెలంగాణా నుంచి రాష్ట్రంలో ప్రవేశించే ప్రధాన ద్వారాల వద్ద తనిఖీలు ముమ్మరం చేసినట్టు వివరించారు. అక్రమ కార్యకలాపాలను అరికట్టడం, ప్రజల భద్రత మెరుగుపరచటం, వాహనాల కదలికలను సమర్థవంతంగా పర్యవేక్షించటం ముఖ్య ఉద్దేశంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ రవాణాలు చేపట్టినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

### మినీ మహానాడుకు

## తరలివెళ్లిన టీడీపీ శ్రేణులు

అచ్చంపేట, మే 18(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం నుంచి మినీ మహానాడుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. క్రోసూరులో జరిగిన మినీ మహానాడుకు ద్విచక్రవాహనాలపై భారీసంఖ్యలో టీడీపీ శ్రేణులు వెళ్ళగా అచ్చంపేటలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం టీడీపీ జెండా ఊపి వాహన ర్యాలీని ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, తిరువాయిపాటి ఆంజనేయులు, తుమ్మా విజయారెడ్డి, రాయుడు సాంబశివుడు, కోట చంటి, బత్తుల శ్రీను, సందెపోగు మహేష్, సందెపోగు సామేలు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంకొండ మండలం నుంచి..

బెల్లంకొండ, మే 18(ఆంధ్రజ్యోతి): క్రోసూరు మార్కెట్‌యార్డులో ఆదివారం జరిగిన మినీ మహానాడుకు మండలం నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. బెల్లంకొండలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ ఆధ్వర్యంలో జండా ఊపి వాహనాలనుప్రారంభించారు. అదేవిధంగా మాచాయపాలెం గ్రామంలో టీడీపీ నాయకుడు గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్ళారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి గ్రామ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సుమారుగా మూడువేల మంది టీడీపీ శ్రేణులు వాహనాల ద్వారా మినీ మహానాడుకు తరలి వెళ్లారు.

## పులిచింతల సమాచారం

అచ్చంపేట, మే 18(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 22.44 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కష్ణకు విడుదల అవుతుందన్నారు.

## రేపు మినీ మహానాడు

సత్తెనపల్లి, మే 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీ మంగళవారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు జరుగుతుందని కన్నా కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపాయి. కార్యక్రమానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ వర్గాలు కోరాయి.

## రాజుల కాలనీలో కుక్కల బెడద

సత్తెనపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజుల కాలనీ, 2వ లైన్‌లో కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, మహిళలపై కుక్కలు ఎగబడి గాయపరుస్తున్నాయి. శనివారం 2వ లైన్‌కు చెందిన ఐదుగురు మహిళలను కుక్కలు కరచి గాయపరిచాయి. దీనివల్ల ఆ లైన్‌లోని మహిళలు, చిన్నారులు కుక్కలను చూసి భయపడుతున్నారు. సంబంధిత మునిసిపల్ అధికారులు కుక్కల బెడదను నివారించాలని రాజులకాలనీ రెండవ లైన్‌కు చెందిన ప్రజలు కోరుతున్నారు. గతంలో కూడా కుక్కలు పలువురిని కలసి గాయపరిచాయని చెపుతున్నారు.

## ఎస్సీ యువతీ యువకులకు కుట్టు శిక్షణ

నకరికల్లు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా స్టిచ్చింగ్, కటింగ్ నందు శిక్షణ ఇస్తున్నట్టు జాబ్స్ కో-ఆర్డినేటర్ వై శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఉపాధి కల్పన సంస్థ సీడాప్ డీడీయూ జీకేవై సంయుక్తంగా ఈ శిక్షణ అందిస్తున్నట్టు తెలిపారు. 10వ తరగతి పాసు లేదా ఫెయిల్ అయిన 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు మధ్య గలవారు నల్లపాడులో ఇచ్చే శిక్షణకు హాజరుకావాలన్నారు. ఈనెల 19నుంచి శిక్షణ ప్రారంభ మవుతుందని తెలిపారు. ఉద్యోగంపై ఆసక్తి లేని వారికి సొంత వ్యాపారం చేసుకొనే వారికి ప్రోత్సాహం కల్పించనున్నట్టు తెలిపారు. శిక్షణా కాలం వ్యవధి 45 రోజులని తెలిపారు. మరిన్ని వివరాలకు డీఆర్‌డీఏ సీడాప్ జాబ్ కో-ఆర్డినేటర్ వై శ్రీనివాసరెడ్డి 99084 82907 నెంబరులో సంప్రదించాలన్నారు.



పిడుగురాళ్లలో తిరంగా ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, కూటమి నేతలు

# సైనికులను గౌరవిద్దాం..

● పిడుగురాళ్లలో తిరంగా ర్యాలీ

పిడుగురాళ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): భారతదేశాన్ని రక్షించడంలో సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించి గౌరవించాల్సిన అవసరం వుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా త్రివిధ దళాలకు మద్దతుగా గురజాల నియోజకవర్గం పిడుగురాళ్లలో ఆదివారం ఎమ్మెల్యే యరపతినేని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బీ బంగ్లా నుండి మార్కెట్ యార్డు వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు తెలుపుతూ సైనికుల పోరాట పటిమకు భారతీయులందరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం వుందన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం ప్రతి భారతీయుడికి గౌరవం అన్నారు. 250 అడుగుల పొడవైనా జాతీయ పతాకాన్ని, జాతీయ జెండాలను చేతబూని సుమారు 1000మందికి పైగా పార్టీ శ్రేణులు, మహిళలు, మాజీ సైనికులు ర్యాలీలో పాల్గొన్నారు. మాజీ సైనికులు ఐతం నాగేశ్వరరావు, మొగిలి వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే యరపతినేని, జంగా కృష్ణమూర్తి సన్మానించారు. ఈ ర్యాలీలో నాగార్జునసాగర్ కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు, యరపతినేని నిఖిల్, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, కల్లం విజయ భాస్కరరెడ్డి, కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాసీం సైదా, కనిగిరి శ్రీను, పాండురంగా శ్రీను, వడ్లవల్లి సర్వేశ్వరరావు, పలువురు పార్టీ నేతలు, మహిళలు పాల్గొన్నారు.

# అభివృద్ధే నా రాజకీయ జీవితాశయం

● రూ.5.92 కోట్లతో నేడు శంకుస్థాపనలు

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 18 (ఆంధ్ర జ్యోతి): మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి నా రాజకీయ జీవితాశయమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దఎత్తున నిధుల కేటాయింపు జరిపి, అభివృద్ధికి బాటలు వేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. దాదాపు రూ.5.92 కోట్లతో సోమవారం నియోజకవర్గంలోని పలు విద్యాలయాల నూతన నిర్మాణాలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. కారంపూడిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం నూతన భవన నిర్మాణాలకు రూ.1.59కోట్లు, దుర్గిలో కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్ నూతన భవన నిర్మాణాలకు రూ.1.52 కోట్లు, వెల్దుర్తిలో కస్తూర్బాగాంధీ పాఠశాలలో నూతన భవనాలకు రూ.1.8కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, జిల్లా అధ్యక్షుడు కొమ్మాళ్లపాటి శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

**మహానాడు విజయవంతం చేయండి**

సోమవారం సాయంత్రం మాచర్లలోని మానుకొండ కల్యాణ మండపంలో జరగనున్న నియోజకవర్గ మహానాడును విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే జూలకంటి పిలుపునిచ్చారు. మహానాడుకు స్థానిక పార్కు సెంటర్ నుంచి భారీ ర్యాలీగా టీడీపీ శ్రేణులు ఆహ్వానం పలకాలని కోరారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి ఉత్సవాల్లో పెద్ద ఎత్తున హాజరై మహానాడును విజయవంతం చేయాలని కోరారు.

**నేడు శిరిగిరిపాడులో జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్**

వెల్దుర్తి మండలం శిరిగిరిపాడు శ్రీవీరాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా గ్రామ పెద్దలు ఏర్పాటుచేసిన జాతీయస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నియోజకవర్గంలో ప్రప్రథమంగా జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ యువతలో క్రీడాస్ఫూర్తి నింపుతుందన్నా రు. సమావేశంలో ధారునాయక్, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, పంగులూరి పుల్లయ్య, రాజబోయిన మధు, గుండాల శ్రీనివాసరావు, షేక్ నాగూర్, అన్వర్, బాదన్ బాయి, సంబోజు వేణు, లెనిన్‌బాబు, కొమెర శివ, మంజుల అంజి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న మేదర సంఘ రాష్ట్ర నాయకులు

### ప్రతిభ చూపిన మేదర విద్యార్థులకు

## నగదు పురస్కారం

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): గత విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షలలో 500కు పైగా మార్కులు సాధించిన పల్నాడు జిల్లాలోని మేదర విద్యార్థులకు ఉపేంద్ర మేదర సంఘం ఆధ్వర్యంలో నగదు పురస్కారాలు పంపిణీ చేశారు. అమరావతిలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మేదర సంఘ అధ్యక్షుడు జొరిగె మస్తాన్‌రావు, గౌరవ అధ్యక్షుడు ధూళిపాళ్ల ఏసుబాబు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొరిగె శ్రీనివాసరావు, శ్రీశైలం మేదర అన్నదాన సత్రం ఛైర్మన్ నందికట్టు హనుమాన్ ప్రసాద్‌లు విద్యార్థులకు రూ.1000 నగదు, ప్రశంసా పత్రం, బ్యాగ్, నోట్‌బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నుండి 20మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని పురస్కారాలు అందుకున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఈ పురస్కారాలు అందజేస్తున్నట్లు పల్నాడు అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో మండల సంఘ నాయకులు జొరిగె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కమనీయం..

## శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

కారంపూడి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భారీ అన్న సంతర్పణ గావించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లుచేసింది.

## దావుపల్లిలో ఎమ్మెల్యే జూలకంటి పర్యటన



రామాంజి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావుపల్లిలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శనివారం పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన హార్టికల్చర్ అధికారి శ్రావణ్‌కుమార్‌ను పరామర్శించారు. ఆయనతోపాటు గాయపడిన శ్రీనునాయక్‌ను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. అలాగే ఇటీవల వినుకొండ నియోజకవర్గం శివాపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన భార్యాభర్తలు జొన్నగిరి రామాంజి, అంకమ్మల కుటుంబాన్ని పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రామాంజి కుటుంబసభ్యులు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కళ్లం రామాంజిరెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ధారునాయక్

మాచర్ల రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ అన్నారు. మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ధారునాయక్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ నుంచే ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. చదువుతోనే పేదరికాన్ని పారదోలవచ్చన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణావత్ వెంకటేష్ నాయక్, మహబూబ్‌నగర్ ఎస్సీ ఎస్టీ కోర్టు పీపీ రాజేశ్వరరావు, హైకోర్టు అడ్వకేట్ కృష్ణారెడ్డి, టీడీపీ ఎస్టీ సెల్ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదవ్, గుండ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీగణపతి సచ్చిదానందస్వామి నుంచి బంగారు పతకం అందుకుంటున్న నాళం కనకమ్మ

## భగవద్గీత కంఠస్థ పోటీల్లో కనకమ్మ ప్రతిభ

రెంటచింతల, మే 18(ఆంధ్రజ్యోతి): పల్నాట ఆధ్యాత్మికవేత్తగా సుపరిచితులైన నాళం నరసింహారావు కుమార్తె కనకమ్మ భగవద్గీత కంఠస్థ పోటీల్లో రాణించి మైసూరు పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి చేతులమీదుగా బంగారు పతకం అందుకుంది. శనివారం రాత్రి మైసూరులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామీ మాట్లాడుతూ సకల సమస్యల పరిష్కారానికి దిక్సూచిలా ఉండే భగవద్గీతను పల్నాడు వాసులు అలవోకగా కంఠస్థం చేయడం సంతోషంగా ఉందన్నారు. కనకమ్మకు బంగారు పతకం రావడం పట్ల మండలానికి చెందిన శిల్పారామం ఛైర్మన్ చేరెడ్డి మంజులారెడ్డి అభినందించారు.



తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, ధారు నాయక్ తదితరులు

# మోదీ నాయకత్వంలో దేశం పటిష్టం

● ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు గుణపాఠం చెప్పాం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం పటిష్టంగా ఉందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలో కూటమి నేతలు, ప్రజలు తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను చేతబూని భారతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. రింగు రోడ్డు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ జరిపారు. ర్యాలీలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రమూకలకు గట్టి గుణపాఠం చెప్పామన్నారు. భారత సైన్యం జరిపిన దాడులకు భయపడి పాకిస్థాన్ కాళ్లబేరానికి వచ్చిందన్నారు. భారత సైన్యం సామర్థ్యం ప్రపంచ దేశాలకు అర్థమయ్యేలా చేశారన్నారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా అన్ని మతాలు, జాతులు, కులాలవారమంతా కలిసిమెలిసి సోదరభావంతో ఉంటామన్నారు. అనంతరం అమర వీరుల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, మాజీ ఛైర్మన్ పోలూరి నరసింహారావు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, యెనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, బొట్టు కోటేశ్వరరావు, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, గుమ్మడి నాసరయ్య, నేరేటి వీరాస్వామి యాదవ్, కొమెర దుర్గారావు, అనంతరాములు, సంబోజు వేణు, సాతులూరి కుమార్, ఓర్సు క్రాంతికుమార్, సూరె యలమంద, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, కంభంపాటి అనిల్‌కుమార్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



తిరంగా యాత్రలో కూటమి నేతలు, అధికారులు

## సైనికుల త్యాగాలకు వందనం

రెంటచింతల, మే 18(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణత్యాగం చేస్తున్న సైనికులకు వందనం.. వారికి బాసటగా నిలుద్దాం.. అంటూ కూటమి నేతలు, అధికారులు ఆదివారం రెంటచింతల పురవీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండాలను చేబూని నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా మాచర్ల నియోజకవర్గ బీజేపీ నేత పోకూరి కాశీపతి మాట్లాడుతూ పాకిస్థాన్‌పై భారత్ దాడి చేయలేదని ఉగ్రవాద శిబిరాలను నాశనం చేసి తీవ్రవాదులను మట్టుపెట్టిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ మండల అధ్యక్షులు ఎం.రాజారెడ్డి, బి.నాగిరెడ్డి, పాశం మట్టారెడ్డి, నారాయణపురం శ్రీనివాసరావు, గుండా రామ్మూర్తి, నాళం పెదబాబు, సైదులు, కొత్త అంజి. వైపీ సైదయ్య, కాశీపతి, పల్లెర్ల శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

## మాచర్లలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుచేయాలి

● ఎమ్మెల్యే జూలకంటికి న్యాయవాదుల వినతి

వెల్దుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని న్యాయవాదులు కోరారు. ఈ మేరకు ఆదివారం వెల్దుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ సంబంధిత అధికారులు, న్యాయశాఖా మంత్రితో చర్చించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందించిన న్యాయవాదుల్లో గంగుల శ్రీనివాసరావు, కేవీ రంగారావు, ఎస్‌కే గాలీబుసాహెబ్, గౌస్‌పాషా, నాగూర్‌జాని, పుల్లారావు, ఖాసీం తదితరులు ఉన్నారు.

## నేడు మంత్రి గొట్టిపాటి కారంపూడి పర్యటన

కారంపూడి, మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం కారంపూడిలో పర్యటించనున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య ఆదివారం తెలిపారు. మాచర్లలో జరగనున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

## గంగమ్మ తల్లి తిరునాళ్లలో పాల్గొన్న నిఖిల్

గురజాలటౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో ఉన్న శ్రీగంగమ్మ తల్లి తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ తిరునాళ్లలో గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు, టీడీపీ యువనేత నిఖిల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధం

గురజాలటౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో గడ్డివామి దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని జనార్ధనపురంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు... గ్రామ శివారులో షార్ట్‌సర్క్యూట్ అవడంతో మెగావత్ రామునాయక్ అనే రైతు గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.25 వేల ఆస్తినష్టం జరిగింది. సీఐ భాస్కర్ మాచర్ల అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో వారు మంటలను అదుపులోకి తెచ్చారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పిడుగురాళ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ పాఠశాల 1998-99 పదవ తరగతి బ్యాచ్ సమావేశం ఆదివారం జడ్పీ పాఠశాలలో జరిగింది. తెలుగురాష్ట్రాలలో వుంటున్న సుమారు 250మంది విద్యార్థులు పాతికేళ్ల తరువాత సమావేశమై నాటి జ్ఞాపకాలను, పాఠశాలలో గడిపిన స్మృతులను నెమరువేసుకున్నారు. నాడు తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

## రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న జిల్లా టీడీపీ నాయకులు కంచేటి సాయిబాబు

క్రోసూరు, మే 18(ఆంధ్రజ్యోతి): వైఎంసీఏ యువత ఆధ్వర్యంలో క్రోసూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పల్నాడు జిల్లా టీడీపీ నాయకుడు కంచేటి సాయిబాబు ఆదివారం ప్రారంభించారు. మొత్తం 40 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని, ఆరోగ్యంతో పాటు నాయకత్వ లక్షణాలను కూడా పెంపొందించుకోవాలన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన బ్యాటింగ్ చేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, అనుముల వెంకటరామిరెడ్డి, మన్నెం శ్రీనివాసరావు, బండారు రాము, పయ్యావుల శివన్నారాయణ, మన్నెం శ్రీనివాసరావు, కంభంపాటి రాము తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌ను వైఎంసీఏ నాయకులు అఖిల్, కొడవటి కిషోర్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

## జవహర్‌ను సన్మానించిన చర్మకార సంఘ నేతలు



జవహర్‌ను సన్మానిస్తున్న చర్మకార సంఘ నేతలు

దుర్గి, మే 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన కేఎస్ జవహర్‌ను దుర్గికి చెందిన చర్మకార సంఘ నేతలు ఆదివారం కొవ్వూరులోని ఆయన కార్యాలయంలో కలిసి దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చర్మకారులు, లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధి కొరకు చొరవచూపాలని, రాష్ట్రవ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న లిడ్ క్యాప్ సంస్థ భూములను పరిరక్షించి వాటిని అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో చర్మకార సంఘం జేఏసీ కన్వీనర్ పులిమెల నాగేశ్వరరావు, అభ్యుదయ చర్మకారుల సంఘం నేతలు కొండూరు కిషోర్‌కుమార్, బాబు జగ్జీవన్‌రామ్ చర్మకారుల సంఘ నేత పూనూరి శివ, కొండమూడి చినకృష్ణ, కందుల ప్రసాద్, కొత్తపల్లి బిక్షాలు, కుప్పాల మనోహర్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



## సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

## హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

**ఏం జరిగింది?:** విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

**యూట్యూబ్‌లో చూసి..:** సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)

ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్థంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో.. సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

### పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.



### ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

### 60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

## ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

## ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

## ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కివ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కివ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

## కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

# చిత్రజ్యోతి

SINCE 1965

## గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. శ్రీయ కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.



## ఆలయ రక్షణ కోసం..

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

## కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

### ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

## హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

## నా కెరీర్‌లోనే ప్రత్యేకం

\- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.

## వసతి గృహంలో వంట పాత్రల చోరీ

నాదెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలోని శాంతినగర్‌లోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహంలో వంట సామగ్రి చోరీకి గురైంది. ఈ విషయాన్ని రాత్రి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న దేవి గుర్తించి ఆదివారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వసతి గృహంలో సుమారు 40మంది విద్యార్థులు ఇక్కడ ఉంటూ చదువుకునేవారు. ప్రస్తుతం వేసవి సెలవలు కావటంతో వార్డెన్‌గా పని చేస్తున్న తిరుపతయ్య వేరే గ్రామానికి వెళ్ళారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో చోరీకి పాల్పడి ఉండవచ్చునని అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## అధిక వర్షంతో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

రొంపిచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో ఆదివారం కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ వైర్లపై చెట్లు పడటంతో సరఫరాను అధికారులు నిలిపివేశారు. విరిగిన చెట్లకొమ్మలను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

## ఆయిల్ మిల్లులో అగ్నిప్రమాదం

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని ఆంజనేయ ఆయిల్ మిల్లులో ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఆయిల్ మిల్లులోని జనరేటర్ వద్ద విద్యుత్ తీగల నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే మిల్లులోని సిబ్బంది గమనించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది.

## కిటకిటలాడిన మహంకాళి ఆలయం

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఇస్సపాలెం గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి చేరుకొని పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## గ్రామస్థాయి నుంచి జనసేనను బలోపేతం చేయాలి

● రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయాలని జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ అన్నారు. ఆదివారం నరసరావుపేటలోని జనసేన కార్యాలయంలో 50మంది క్రియాశీలక వలంటీర్లుకు సభ్యత్వం కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా జనసేన అధినేత, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మనోగతాన్ని సయ్యద్ జిలానీ చదివి వినిపించారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు జనసేన కిట్లు అందించి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు జీవీఎస్ ప్రసాదు, రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు అచ్చుల సాంబశివరావు, క్రియాశీలక వలంటీర్ల, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా సాయి బాబా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ సాయి బాబా ఆలయ 24వ వార్షికోత్సవ తిరునాళ్ల ఆదివారం ఘనంగా నిర్వహించారు. జొన్నలగడ్డ గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణ దేవరాయలు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## నేడు శిడిమానోత్సవం

ఈపూరు, మే 18( ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చర్ల గ్రామంలో అంకాల పరమేశ్వరి కొలుపుల్లో భాగంగా సోమవారం శిడిమానోత్సవం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. భక్తుల కోరికలు అమ్మవారు తీర్చిందని నమ్మకంతో ఈ ఉత్సవాన్ని వైభవంగా జరుపుకుంటారు. ఈ ఉత్సవానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు. ఈ ఉత్సవంతో అంకాల పరమేశ్వరి అమ్మవారి కొలుపులు ముగుస్తాయి.

## బాల శౌరిరెడ్డికి పలువురి నివాళి

నాదెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత గాదె బాల శౌరిరెడ్డి భౌతికకాయానికి ఆదివారం పలువురు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జీడీసీసీబీ మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరిముల్లా, నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, సీనియర్ నేత ఎం. జగన్నాథరెడ్డితో పాటు పలువురు నాయకులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో సమాధి కార్యక్రమాన్ని నిర్వహించారు.

## చిట్టడవిలా... పెరుమాళ్లపల్లి మేజర్ కాలువ



అడవిలా ఉన్న పెరుమాళ్లపల్లి మేజర్‌కాలువ

● మరమ్మతులు లేక చివరి భూములకు చేరని నీరు
● ఇక్కట్లు పడుతున్న రైతులు
● పంటలకు నీరందించాలని రైతన్నల డిమాండ్

వినుకొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల గడిచినా ఎన్‌ఎస్‌పీ కాలువ స్థితి మారకపోవడంతో రైతుల పంట పొలాలకు నీరు చేరక రైతులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నియోజకవర్గంలో అత్యధిక పంట పొలాలకు నీరందించే పెరుమాళ్లపల్లి కాలువ అధ్వానంగా ఉంది. గత పాలకుల హయాంలో అధికారులు కాలువ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేకపోవడంతో ఏపుగా పెరిగిన పిచ్చిచెట్ల తాకిడికి అడవిని తలపిస్తోంది. ఇటీవల జరిగిన నీటి సంఘం ఎన్నికలతో అయినా కాలువలకు మహర్దశ వస్తుందని భావించిన రైతులకు నేడు ఆ పరిస్థితి కనిపించకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరసరావుపేట రోడ్డులోని రైల్వే కాలువకట్ట వద్ద నుంచి పెరుమాళ్లపల్లి వరకు ఉన్న మేజర్ కాలువకు కొన్నేళ్లగా మరమ్మతులు లేకపోవడంతో చివరి భూములకు నీరు చేరని పరిస్థితి నెలకొని ఉంది. ఇదిలా ఉండగా చాట్రగడ్డపాడు సమీపంలో ఏర్పాటుచేసిన గుండ్లకమ్మ ఎత్తిపోతల పథకం కాలువను పెరుమాళ్లపల్లి కాలువకు అనుసంధానం చేసి ఆ నీటిని రైతులు భూములకు వినియోగిస్తున్నారు. కనీసం కాలువలపై ఏపుగా పెరిగిన పిచ్చిచెట్లతోపాటు కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించిన దాఖలాలు లేకపోవడంతో నీరు ముందుకు సాగని పరిస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైనా ఎన్‌ఎస్పీ అధికారులు స్పందించి పెరుమాళ్లపల్లి మేజర్ కాలువపై ఇరువైపులా ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి కాలువల్లో పూడిక తొలగించి రానున్న ఖరీఫ్ కాలంలోనైనా సాగర్ జలాలను పంట పొలాలకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కాలువకు నీరు రాక కట్టలను పంట పొలాల బాటలుగా మార్చుకున్న రైతులు



పెరుమాళ్లపల్లి మేజర్‌కు అనుసంధానంగా ఉన్న ఎత్తిపోతల కాలువ దుస్థితి

## రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసుల తనిఖీలు



వినుకొండ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

వినుకొండ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వినుకొండ పట్టణంలో సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ఆదివారం తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా అనుమానితులను విచారించారు. అనుమానిత వస్తువులు ఏమైనా తీసుకువెళ్తున్నారేమోనని పరీక్షించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతాలలో అనుమానిత వస్తువులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, రాత్రివేళల్లో ప్రయాణ సమయంలో ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు సమాచారం అందిస్తే రక్షణ కల్పించడం జరుగుతుందని తెలిపారు. మీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణతో పాటు డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని రూపుమాపేందుకు ప్రజలు సహకరించాలి

● బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు

శావల్యాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని రూపుమాపడమే లక్ష్యంగా కృషి చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలంతా తమవంతు సహకారాన్ని అందించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం జరుగుతున్న పరిణామాల దృష్ట్యా భారత ఆర్మీకి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన శావల్యాపురంలో ఆదివారం తిరంగ ర్యాలీని నిర్వహించారు. పాకిస్థాన్ జరిపిన కాల్పుల్లో మృతిచెందిన భారత సైనికుడు మురళీనాయక్‌కు జోహార్లు తెలియజేశారు. ఉగ్రవాదం అంతం భారత్ పంతం అంటూ నినాదాలు చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు భారత ప్రభుత్వం పాకిస్థాన్‌తో యుద్ధానికి సిద్ధమైందని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొంటున్న ప్రతి నిర్ణయానికి ప్రజలంతా బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గంటవారిపాలెం డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ, బీజేపీ సీనియర్ నేతలు పత్తి మణికంఠ నాయుడు, శివాది వెంకయ్యనాయుడు, ఆంజనేయప్రసాద్, సిద్ధయ్య, నాదెండ్ల నరసింహారావు, దివ్యకోలు నాగేశ్వరరావు, గోపు శ్రీనివాసరావు, రావినూతల ఆదాము తదితరులు పాల్గొన్నారు.




శావల్యాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నేతలు

## సీలింగ్ ల్యాండ్‌ను పేదలకు పంచాలి

● సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

వినుకొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తప్పుడు రికార్డులు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్న సీలింగ్ ల్యాండ్‌ను ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు డిమాండ్ చేశారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వినుకొండ పట్టణంలోని 212 సర్వే నంబర్లలో నాటి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేపట్టిన అక్రమ రిజిస్ట్రేషన్లపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు ఆధారాలతో సహా పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. దీనిపై ఈ నెల 26వ తేదీన తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో పాలిస్తున్న పాలకవర్గ పార్టీలు కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తూ శ్రామికులకు, రైతులకు, కార్మికులకు హానిచేసే చట్టాలు తీసుకురావడం వల్ల దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి పాలకవర్గాలపై రోజురోజుకు వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ప్రజల మధ్య మతాల పేరుతో వైరుధ్యాలు పెంచుతూ తమ రాజకీయ మనుగడను కొనసాగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుచేయక అవకాశవాద రాజకీయాలతో కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఫిరోజ్, మునగపాటి ప్రసాద్, కామా వెంకటేశ్వర్లు, పల్లపాటి భాస్కర్, ముప్పాళ్ల ప్రసాద్, వెంకయ్య, జయరావు, కొండలు, యలమంద, నాగులు, షారూక్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

వేల్పూరు (శావల్యాపురం) మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరులో స్టేట్‌బ్యాంక్ వద్దనున్న విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. స్తంభానికి చుట్టూ ఉన్న సిమెంట్, కంకరు రాలిపోయి ఇనుప ఊచలు బయటపడ్డాయి. బ్యాంక్ పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ వందలాదిమంది ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. నర్సరావుపేట, వినుకొండ, శావల్యాపురంలకు వెళ్ళేందుకు ఇదే మార్గంలో వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. రద్దీగా ఉండే మార్గంలో రోడ్డుపక్కన విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉన్నా విద్యుత్ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా, నిమ్మకు నీరెత్తనట్లుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చాలని, గ్రామంలో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు కూడా మార్పించాలని ప్రజలు కోరుతున్నారు.



స్టేట్‌బ్యాంక్ వద్ద దెబ్బతిన్న విద్యుత్ స్తంభం



నూజెండ్లలో జరిగిన నగరోత్సవంలో పాల్గొన్న దీక్షా స్వాములు

## హనుమాన్ దీక్షా స్వాముల నగరోత్సవం

నూజెండ్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నూజెండ్లలో ఆదివారం హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా దీక్షా స్వాములు నగరోత్సవం నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ వరకు ప్రతిరోజు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించినట్టు ఆలయ ప్రధాన అర్చకులు క్రోసూరి రామ్మోహనాచార్యులు తెలిపారు.

## పాతడేటాతో రేషన్‌కార్డులు కోల్పోతున్న లబ్ధిదారులు

శావల్యాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులు పొందేందుకు అన్ని అర్హతలున్నా ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ దరఖాస్తుల సైట్‌లో కుటుంబసభ్యులకు చెందిన పాతడేటా చూపిస్తుండడంతో అర్హతలున్నా రేషన్‌కార్డులు పొందలేకపోతున్నారని మండలంలోని వేల్పూరు గ్రామస్థులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలోని తండ్రి, కొడుకులు పొలాలు పంచుకొని పట్టాదారు పాసుపుస్తకాలు పొందాక రేషన్ కార్డుకు దరఖాస్తులు చేసుకునేందుకు సచివాలయాలకు వెళితే నవశకం బెనిఫీషరీ మేనేజ్‌మెంట్ సైట్‌లో డిజిటల్ అసిస్టెంట్లు వివరాలు నమోదు చేసేప్పుడు కుటుంబానికి చెందిన ఉమ్మడి ఆస్తిని చూపిస్తోందని, దాంతో అర్హతలున్నా రేషన్ కార్డుకు దరఖాస్తులు చేయలేకపోతున్నామని వాపోయారు. రేషన్‌కార్డు పొందేందుకు దరఖాస్తుదారునికి మూడెకరాల మాగాణి, పదెకరాల మెట్టకు మించి ఉండరాదని ప్రభుత్వం చెబుతోందని, గ్రామానికి చెందిన మరికొందరు రైతులకు కూడా అర్హతలు ఉన్నా కూడా సైట్‌లో మాత్రం ఉమ్మడి ఆస్తులు చూపిస్తుండటంతో తండ్రీ, కొడుకులిద్దరూ రేషన్ కార్డు పొందే అర్హతను కోల్పోవాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి రేషన్ కార్డు సైట్‌లో సమస్యలు పరిష్కరించి అర్హతలున్న లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు అందించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

## 200 మందికి కంటి పరీక్షలు



డాక్టర్ చెంచిరెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిమ్మతోటలోని సిల్మన్ మెమోరియల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 200మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 46మందికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. డాక్టర్ చెంచిరెడ్డి మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు త్వరలోనే ఉచితంగా నిర్వహిస్తామన్నారు. విజయశ్రీ ల్యాబ్స్ బ్లడ్ టెస్ట్ షుగర్ టెస్ట్, లేక్షన న్యూట్రిషన్ సెంటర్ వారు బీఎంఐ బాడీ చెకప్‌తో పాటు అన్నిరకాల కంటి పరీక్షలు నిర్వహించి రోగులకి ఉచితంగా మందులను అందజేశారు. నార్ల ఫౌండేషన్, డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి మేనేజర్ వీరయ్య, నార్ల మారుతిబాబు, కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, నల్లపాటి రామచంద్రప్రసాద్, అల్లంశెట్టి మోహన్‌రావు, బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ పాల్గొన్నారు.

## వైసీపీని అణగదొక్కేందుకే అక్రమ కేసులు

● గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీని, కార్యకర్తలను భయపెట్టి అణగదొక్కేందుకే అక్రమ కేసులు పెడుతున్నారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నరసరావుపేట క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో రాజకీయాలు, అభివృద్ధి జరగటం లేదని, ఫ్యాక్షనిజం నడుస్తున్నట్లు అందరికీ అర్థం అవుతుందన్నారు. కూటమి ప్రభుత్వానికి హామీలు నిలబెట్టుకోవడం చేతకాక జగన్‌మోహన్‌రెడ్డి అడ్డమని, ఏడాదిలోనే ఆయన గ్రాఫ్ పెరిగిపోతోందని ప్రభుత్వానికి అర్థం అయిందన్నారు. వైసీపీని, కార్యకర్తలను అణగదొక్కాలని, భయపెట్టాలని అక్రమ కేసులు పెడుతున్నారని అన్నారు. అక్రమంగా జగన్‌మోహన్‌రెడ్డిని జైలులో పెట్టి, 16 నెలలు జైలులో ఉంచితే ఏమైనా తేలిందా, 15సంవత్సరాలు అయిందన్నారు. అన్యాయంగా కేసులు పెడుతున్నారని, ఎవరు భయపడేది లేదన్నారు. ఇదేమన్నా జగన్‌మోహన్‌రెడ్డికి కొత్తా అని, పోరాటలు చేస్తామని, న్యాయస్థానాలలో తేల్చుకుంటామన్నారు. నాలుగు సంవత్సరాల తర్వాత జరిగే ఎన్నికలలో అఖండ విజయంతో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి కన్నా ఎక్కువ ఇస్తామంటే ఆశపడ్డామని, ఈ రోజు దగా పడుతున్నామని ప్రజలు అంటున్నారని అన్నారు.

## కల్యాణ వెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలతో ప్రత్యేక పూజలు

నరసరావుపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉన్న కళ్యాణ వెంకటేశ్వరస్వామికి వైశాఖ మాసం సందర్భంగా లక్షమల్లెలతో ఆదివారం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భ్రమరనాథ్, సాయి ప్రసాద్, 58మంది మహిళలతో వైభవంగా పూజలు నిర్వహించారు. అప్పల గోపాలకృష్ణ, అప్పల బాలకోటేశ్వరరావులు సహకారం అందజేశారు. కార్యక్రమంలో చేగు వెంకటేశ్వరరావు, పొట్టి శివశంకరరావు, శ్రీదేవి, నేరెళ్ళ విజయలక్ష్మి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో కల్యాణ వెంకటేశ్వరస్వామి

## వేల్పూరు - గోగులపాడు రోడ్డు గుంతలమయం



తారురోడ్డుపై ఏర్పడ్డ గుంతలు

వేల్పూరు(శావల్యాపురం)మే18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరు నుంచి గోగులపాడుకు వెళ్ళే మార్గంలో తారురోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఈ మార్గంలో వివిధ గ్రామాల ప్రజలు నిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. వేల్పూరు రైతులు నిత్యం పొలాలకు వెళుతుంటారు. తారురోడ్డుపై అడుగులోతు గుంతలు పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రాత్రివేళల్లో తారురోడ్డుపై గుంతలు కనిపించక ఇటీవల కొందరు వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## కేంద్రీయ విద్యాలయం నిర్మాణం ఎప్పుడో..?

○ వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డు స్థలం కేటాయింపు
○ మట్టి పరీక్షలు, రూ.30 లక్షల మేర మెరక పనులు పూర్తి
○ కూటమి ప్రభుత్వం రావటంతో నిర్మాణ స్థలంపై సందిగ్ధం



రొంపిచర్ల మార్కెట్ యార్డు స్థలం



కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

రొంపిచర్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రొంపిచర్ల మార్కెట్ యార్డులో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి నిర్ణయం ఒక కొలిక్కి రాలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రొంపిచర్లలోని మార్కెట్ యార్డులో సుమారు ఐదు ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ కేటాయించింది. అనంతరం మట్టి పరీక్షలు నిర్వహించారు. రూ.30లక్షల మేర మట్టిని తోలి చదును చేశారు. పలుమార్లు నివేదికలు పంపటం, అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడి చేయటంతో సరిపోయింది. ఇంతలో ఎన్నికలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మరలా కూటమి ప్రభుత్వ హయాంలో నివేదికలు తయారుచేసి రెవెన్యూ అధికారులను పంపమన్నారు. మార్కెట్ యార్డు స్థలంలో పాటు సంతగుడిపాడు, రామిరెడ్డిపాలెం రహదారిలో స్థలాలను అధికారులు అన్వేషించారు. ఐతే కేంద్రీయ విద్యాలయ నిర్మాణంపై ఇంతవరకు ఒక నిర్ణయం ఖరారు కాలేదు. ఇటీవల నరసరావుపేట మండలం కేసానుపల్లి సమీపంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అసలు మండలంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం జరుగుతుందా?, లేదా? అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. సంతగుడిపాడులో వెటర్నరీ కళాశాల నిర్మాణాన్ని కూడా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మరిచారు. కేంద్రీయ విద్యాలయ నిర్మాణం జరిగితే మండల కేంద్రమైన రొంపిచర్లకు కొంతమేర ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.